ఇంటికి తిరిగి వచ్చేసరికి నా తల ప్రాణాలు తోకకొచ్చాయి. అప్పటి నుంచీ బయటకు రావాలంటేనే భయంగా ఉంది. ఇంట్లో వాళ్ళు కూడా ఒక్కత్తివీ వెళ్ళద్దంటున్నారు. అందుకే రోజూ గుళ్ళోకి రావటం లేదు" అని చెప్పారు.

అంతా విన్నాక అయ్యో ఆ రోజు ఆ నయవంచకుడెంత నటించాడు. ఇది హైటెక్ యుగం కదా! హైటెక్ మోసం అనుకుంటూ ఇంటి ముఖం పట్టాను.

-జి.వాణి (హైదరాబాద్)

# ప్రాప్తం

"యువర్ ఎటన్షన్ ప్లీజ్... నెంబర్..." స్టేషన్లో ఎనౌన్స్‌మెంట్ వినిపిస్తోంది. తిరుమల ఎక్స్‌ప్రెస్ రావడానికి టైమయింది. ప్రయాణికులందరూ తమ లగేజీలతో సిద్ధంగా ఉన్నారు. మూర్తికి ప్రమోషన్ వస్తే తిరపతికొస్తానని మొక్కుకున్నాడు. మొక్కు తీర్చుకునేందుకు బయల్దేరాడు. అనుకున్నదే తడవు వాళ్ళ ఫ్రెండ్ మల్లిక్‌కు చెప్పి వాళ్ళని కూడా బయల్దేరదీసి ట్రైన్, కాటేజీ రిజర్వేషన్‌లు, దర్శనానికి విఐపి ఉత్తరాలు సేకరించి బయల్దేరారు. రైలులో ఇద్దరు ఫ్రెండ్స్ తమ కుటుంబాలతో సహా ఎక్కి సర్దుకుంటున్నారు. అలా పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు కాలక్షేపానికి. "ఏదో ఇలా ప్రాప్తమవుతోంది మాకు కూడా దైవ దర్శనానికి మీ దయవల్ల" అన్నాడు మల్లిక్.

"మా దయకేముంది అన్నయ్యగారూ... అదంతా తిరుమలేశుని దయ. దేనికైనా ప్రాప్తముండాలి" అంది మూర్తి భార్య సుజాత. ఆవిడకు కాస్త దైవచింతన ఎక్కువ. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొంటుంది. అలా రైలు స్టేషన్లను దాటుకుంటూ ప్రయాణిస్తోంది. ఏదో పెద్ద స్టేషను వస్తోందని భోజనాలు కానిద్దామని కేరియర్లు తీసి పిల్లలకు సర్దుతున్నారు. ఇంతలో మా ప్రక్క బెర్త్‌లలో ఉన్న జంట.. బహుశా క్రొత్తగా పెళ్ళయిన జంట. పెళ్ళయాక తిరుపతికి బయల్దేరినట్లున్నారు. ఆ అమ్మాయి కేరియర్ మూత రావట్లేదని, ఆయనకిచ్చి తీయమంది. వేడి పదార్థాలుంచిన తరువాత వెంటనే మూత పెట్టడం వల్లనేమో అది కాస్తా బిగుసుకుపోయి తెరుచుకోలేదు. ఆయన ప్రయత్నించి, కొంచెం బలప్రయోగం చేసే సరికి అది ఎగిరిపడి పదార్థాలన్నీ చెల్లా చెదురుగా క్రింద పడిపోయాయి. పాపం బిక్క మొహం వేసుకుని వాటన్నిటిని వేస్టు పేపరుతో ప్రక్కకు తుడిచి, ఏమైనా తినడానికి దొరుకుతుందేమో అని ఎదురు చూస్తున్నారు. సుజాత ఆ పరిస్థితిలో వాళ్ళని చూసి, తమ దగ్గర ఉన్న వాటిని వాళ్ళక్కూడా ప్లేట్‌లోపెట్టి ఇస్తే కొంత మొహమాటపడి, ఆఖరుకి తీసుకున్నారు. భోజనాలయాక ఎఫ్ఎం రేడియోలో సినీకవిగారి పాట వినపడ్తోంది 'కతికేటి మెతుకే నీద యితే విధి చెక్కుతుందీ నీ పేరే...'

ooo

తిరుపతి దర్శనం బాగా అయింది. రెండు సార్లు దర్శనాలయాక చుట్టు ప్రక్కల అన్ని తీర్థాలు చూశాక, ప్రసాదాలు ఎక్కువగా కొనుక్కొని, టేక్సీలో క్రింది తిరుపతికి తిరుగు ప్రయాణం అయారు. ఘాట్‌రోడ్‌లో క్రిందకి దిగి, సామాన్లు తీసుకుని ట్రైన్‌లో సర్దుకున్నారు అప్పుడు చూసుకునేసరికి ప్రసాదాల బేగ్ కనపడలేదు. బహుశా టేక్సీలోనే ఉండిపోయిందేమో? తిరుపతి లడ్డుకున్న మహత్యం చేత మళ్ళీ ప్రయత్నించుదామన్నా, రిజర్వేషన్ కన్‌ఫరమ్ అవడంచేత, బాధని దిగమింగుకుని బయల్దేరేము. ఏం తప్పు చేసాము స్వామి? మాకిలాంటి శిక్ష వేశావు? అని సుజాత వందసార్లయినా అనుకుంది. మనకి ప్రసాదం ప్రాప్తం లేదేమో అనుకుని స్థిమితపడింది. లేకపోతే విఐపి ఉత్తరంతో మరిన్ని లడ్లు కొనుక్కుని, అక్కడ తినకుండా ఇంటికెళ్ళి పూజ చేసి తినాలని మరీ లడ్డూలను భద్రం చేసినా, తినడానికి ప్రాప్తం లేకుండా పోయిందని తెగ బాధపడిపోయి, అలా ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకున్నారందరూ...

ooo

చిన్నగా తెల్లవారుతోంది. సుజాతకు మాత్రం కలతనిద్రే. తెల్లవారుతుండగా కునుకు పట్టినట్లయింది. రైలు అన్నవరం దాటింది. ఇక ఒక్కొక్కరు నిద్రలేస్తున్నారు. మొహాలు కడుక్కొని ఫ్రెష్ అవుతున్నారు. మా బెర్త్‌లపై ఎవరో వచ్చి కూర్చున్నట్లున్నారు. పగలు కదా అని సరిపెట్టుకున్నాము. అలా వాళ్ళు కొంచెం సేపుండి ఏదో స్టేషన్లో దిగి వెళ్ళిపోయారు. అదో పెద్ద బృందంలా వుంది. మేం కూడా ఇక దిగడానికి అన్నీ సర్దుకుంటుండగా అప్పుడు కనిపించిందో పెద్ద ప్లాస్టిక్ కవరు- 'సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం, అన్నవరం' అని ఆ కవరు మీద వుంది. ఎవరిదో ఆ కవరు అని అక్కడున్న వాళ్లందర్నీ అడిగినా ఫలితం లేదు. కవర్లో చూస్తే 8 పేకెట్ల స్వామివారి 'ప్రసాదం'. ఉదయాన్నే వ్రతం చేయించుకున్నట్లుంది- ప్రసాదం ఇంకా వేడిగానే వుంది. నా గుండె ఝుల్లుమంది. స్వామి వారికి మా మీద దయ కల్గిందా? ఈ రూపంలో ప్రసాదాన్ని పంపారా? తిరుపతిలో పోగొట్టుకున్న ప్రసాదం, ఇలా మళ్ళీ ఈ రూపంలో మాకు ప్రాప్తించిందా? ప్రతి మెతుకు మీద తినేవాడి పేరుండడం అంటే ఇదేనా? భగవత్కటాక్షం మాకుందా? నిజంగానే స్వామి మమ్మల్ని కరుణించేరా? ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తోంది సుజాత. మళ్ళీ మనసులో చిన్న అనుమానం. ఈ సంచికోసం ఎవరైనా వస్తారేమో... అని. రైలు దిగి ఇంటికి వెళ్ళి ప్రసాదాన్ని పంచుకుని తిని మళ్ళీ మొక్కుకుంది సుజాత 'వ్రతం చేయించుకోవడానికి నీ కొండకు రావడానికి ప్రాప్తం కలగాలని'



-ఎ.వి.రాధాకృష్ణమూర్తి

(విశాఖపట్నం)